పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత, పీవీ తనయ, ఎమ్మెల్సీ వాణీదేవి

పీవీ సేవలు చిరస్మరణీయం

- ఆర్థిక సంస్కరణలతో దేశ గౌరవాన్ని పెంచారు
- అలాంటి యోధుడిని కాంగ్రెస్ అవమానించింది
- పీవీ శతజయంతి ఉత్సవాలను కేసీఆర్ ఘనంగా నిర్వహించారు
- పీవీ వర్ధంతి కార్యక్రమంలో కవిత
- పీవీని ఆదర్శంగా తీసుకోవాలి: ఎమ్మెల్సీ వాణీదేవి
- తెలంగాణ భవన్‌లో పీవీకి బీఆర్ఎస్ నేతల నివాళులు

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): దేశానికి పీవీ నర్సింహారావు అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ కవిత కొనియాడారు. ఆర్థిక సంస్కరణలతో భారతదేశ గౌరవాన్ని విశ్వవ్యాప్తం చేసిన యోధుడని కీర్తించారు. అటు పార్టీకి, దేశానికి జీవితాన్ని ధారపోసిన పీవీని కాంగ్రెస్ అడుగడునా అవమానించిందని ఆరోపించారు. ఆయన మరణిస్తే ఢిల్లీలో అంత్యక్రియలు కూడా నిర్వహించలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ విస్మరించినా కేసీఆర్ మాత్రం హైదరాబాద్‌లో స్మారక మ్యూజియం నిర్మించి, శతజయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించి సమున్నతంగా గౌరవించారని గుర్తుచేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన పీవీ వర్ధంతి కార్యక్రమంలో పీవీ చిత్రపటానికి బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. అనంతరం కవిత మాట్లాడుతూ పీవీ ఆచరించిన రాజకీయ విలువలు, నిబద్ధత ప్రస్తుత పరిస్థితుల్లో ప్రశ్నార్థకమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాణీదేవి మాట్లాడుతూ సిద్ధాంతాల కోసం పీవీ తన జీవితాన్ని ధారబోశారని కొనియాడారు. మేధో సంపత్తితో దేశానికి ఎనలేని సేవలు అందించారని తెలిపారు. ఆయన జీవితాన్ని ఈతరం ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవలో నిమగ్నం కావాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 14 భాషలను అలవోకగా మాట్లాడే పీవీ నర్సింహారావును ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

పీవీ ఆశయాలను కొనసాగించాలి

- వంగరలో నవోదయ పాఠశాల ఏర్పాటుకు కృషి
- వంగరలో పీవీ వర్ధంతి సభలో మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, డిసెంబర్ 23 : పీవీ ఆశయాలను కొనసాగించాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. పీవీ స్వగ్రామం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో సోమవారం పీవీ 20వ వర్ధంతి సభ పీవీ ప్రభాకర్‌రావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఎమ్మెల్సీ సురభివాణీదేవి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ సీపీ అంబర్ కిశోర్‌ఝా, వొడితెల ప్రణవ్‌బాబు పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ నవోదయ పాఠశాలలను నెలకొల్పింది పీవీయే అని గుర్తు చేశారు. హనుమకొండ జిల్లాలో నవోదయ పాఠశాల లేనందున వంగరలో ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. వంగర చెరువును పర్యాటకంగా మార్చి పీవీ స్మారక పనులు పూర్తి చేస్తామని చెప్పారు. వంగరలో తాను పుట్టి పెరిగిన జ్ఞాపకాలు ఇంకా పదిలంగానే ఉన్నాయని, ఈ గడ్డపై పుట్టడం అదృష్టంగా భావిస్తున్నానని పీవీ కూతురు సురభివాణీదేవి పేర్కొన్నారు.

ఢిల్లీ డైరెక్షన్‌లోనే కేటీఆర్‌పై కేసు

- బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఒక్కటే
- రైతు భరోసా ఎగవేతకు సర్కారు కుట్ర
- రాష్ట్రంలో 10% కమీషన్ ప్రభుత్వం
- మేమంతా కేసీఆర్ సైనికులం
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో కవిత

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలిసే పనిచేస్తున్నాయని, ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ దానిని బీజేపీ నడిపిస్తున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కేటీఆర్‌పై కేసు నమోదు చేయడంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటేనని మరోమారు స్పష్టమైందని పేర్కొన్నారు. ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ పెద్దలను కలిసిన తర్వాతే కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిందని ఆరోపించారు. 'తొలుత సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో బీజేపీ పెద్దలను కలిశారు. ఆ తర్వాత గవర్నర్ కేసు నమోదుకు అనుమతి ఇచ్చారు. అనంతరం ఏసీబీ కేసు నమోదు చేసిన మరునాడే ఈడీ కేసు నమోదు చేసింది. దీనిని బట్టి చూస్తే ఆ రెండు పార్టీలు కలిసే పనిచేస్తున్నట్టు స్పష్టమవుతున్నది' అని పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆమె మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. దేశంలో ప్రాంతీయ పార్టీలు ఉండకూడదన్న లక్ష్యంతో కాంగ్రెస్, బీజేపీ కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. కేసీఆర్ వంటి బలమైన నాయకులను దెబ్బకొట్టాలని ఆ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే, కేసీఆర్‌ను దెబ్బకొట్టడం ఆ పార్టీలకు సాధ్యం కాదని తేల్చిచెప్పారు. కక్షసాధింపులో భాగంగానే కేటీఆర్‌పై ఏసీబీ, ఈడీ కేసు నమోదు చేశాయని, ప్రజల పక్షాన పోరాడుతున్నందుకే టార్గెట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజల దృష్టిని మళ్లించేందుకే అల్లు అర్జున్ అంశం

రాష్ట్రంలో ప్రతీకార పాలన సాగుతున్నదని ఎమ్మెల్సీ కవిత ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలపై దాడి చేయడాన్ని రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికే అల్లు అర్జున్ వ్యవహారాన్ని ప్రభుత్వం తెరమీదికి తెచ్చిందని పేర్కొన్నారు. నిజానికి రాష్ట్రంలో 10 శాతం కమీషన్ ప్రభుత్వం నడుస్తుందని ఆరోపించారు. అందరి కోసం కాకుండా కొందరి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని, ప్రభుత్వ ప్రాధాన్యతలు పెద్ద వాళ్లపైనే ఉన్నాయని విమర్శించారు. మేఘా కృష్ణారెడ్డి వంటి వారి కంపెనీలకు వేల కోట్ల బిల్లులు చెల్లిస్తున్న రేవంత్‌రెడ్డి సర్కార్ పేదలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలకు మాత్రం నిధులు విడుదల చేయడం లేదని ఎండగట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విషాహారం తిని గురుకులాల్లో 57 మంది పిల్లలు చనిపోయారని, వారి కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాకపోవడం వల్ల అనేక మంది రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందిస్తామని ప్రకటించారు.

రాష్ట్రాన్ని ప్రపంచబ్యాంకుకు తాకట్టు

సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణను ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెడుతున్నా కమ్యునిస్టులు మౌనంగా ఎందుకు ఉంటున్నారని కవిత ప్రశ్నించారు. ప్రపంచ బ్యాంకు చీకటి చరిత్ర నేపథ్యంలో పదేండ్ల పాటు ఆ బ్యాంకును కేసీఆర్ తెలంగాణకు దూరంగా ఉంచారని పేర్కొన్నారు. భూభారతితో భూభద్రత ఉండదని విమర్శించారు. భూభారతి చట్టం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను నాశనం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూభారతి చట్టాన్ని తిరోగమన చర్యగా అభివర్ణించారు. ధరణిపై విషప్రచారం చేశారని, ప్రజలు తిరిగి ధరణి వ్యవస్థ కావాలని ఉద్యమించే పరిస్థితి వస్తుందని తెలిపారు.

నిధులున్నా పైసా పనిచేయని సర్కార్

కేంద్ర ప్రభుత్వం నుంచి పుష్కలంగా నిధులు వస్తున్నాయని ప్రభుత్వమే చెప్తున్నదని కానీ, ప్రజలకు పైసా పనులు కావడం లేదని కవిత విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ 2500 ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ అమలు చేయడం లేదని, తద్వారా ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ. 30వేలు బాకీ పడిందని వివరించారు. మహిళలకు కల్పించిన ఉచిత బస్సును తాము ఆహ్వానిస్తున్నామని, అదే సమయంలో బస్సుల సంఖ్యను తగ్గించారని ఆరోపించారు. బస్సుల సంఖ్య తగ్గడం ద్వారా ప్రయాణికులందరికీ ఇబ్బందులు కలుగుతున్నాయని చెప్పారు.

పదవుల కోసం రాలేదు

తాము పదవుల కోసం రాజకీయాల్లోకి రాలేదని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయడంలో వెనక్కి తగ్గేదే లేదని తేల్చిచెప్పారు. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ తమ జీవితంలో భాగమని పేర్కొన్నారు. 'మేం పదవుల కోసం వచ్చినవాళ్లం కాదు. ప్రజల నుంచి వచ్చినవాళ్లం' అని స్పష్టం చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ తయారు చేసిన సైనికులమని పేర్కొన్నారు. ఉమ్మడి పాలనలో అనేక విధాలుగా తట్టుకొని నిలబడ్డామని చెప్పారు.

తెలంగాణ తల్లి కోసం ఊరూరా ఉద్యమమే

తెలంగాణ అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీసే కుట్ర చేస్తున్నదని, ఆ కుట్రలను అడ్డుకుంటామని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. గ్రామగ్రామాన ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతిష్ఠిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా తట్టెడుమట్టి తీయలేదని విమర్శించారు. ఇప్పటికే నడుస్తున్న ప్రాజెక్టులను కూడా పూర్తిచేయని పరిస్థితి కనిపిస్తున్నదని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా కొద్దిపాటి నిధులు వెచ్చించి మూడు నాలుగు కిలోమీటర్ల మేర పనులు చేపడితే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ఇప్పటికే నీళ్లు అందేవని వివరించారు. కానీ, ప్రాజెక్టును పూర్తి చేయడానికి మాత్రం ప్రభుత్వానికి మనసు రావడంలేదని మండిపడ్డారు. పరిమిత నిధులు వెచ్చించడం ద్వారా పూర్తయ్యే ప్రాజెక్టులను కూడా ప్రభుత్వం విస్మరించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగిత్యాలకే పరిమితం కాను

జగిత్యాల నుంచి పోటీ చేస్తారా? అన్న విలేకరుల ప్రశ్నకు కవిత స్పందిస్తూ తాను జగిత్యాలకే పరిమితం కాబోనని, రాష్ట్రవ్యాప్తంగా ఏ సమస్య వచ్చినా వెళ్తానని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని వెల్లడించారు. తెలంగాణ జాగృతి, బీఆర్ఎస్ పార్టీ వేర్వేరు కాదని కలిసే పనిచేస్తాయని తెలిపారు.

జీసీటీఏ అధ్యక్షుడిగా శ్రీనివాస్

- ప్రధాన కార్యదర్శిగా బ్రిజేశ్ ఎన్నిక

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ డిగ్రీ కాలేజీ టీచర్స్ అసోసియేషన్(టీజీసీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బీ శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఈ బ్రిజేశ్ ఎన్నికయ్యారు. ఉస్మానియా ఫ్యాకల్టీ క్లబ్‌లో జరిగిన ఎన్నికల్లో శ్రీనివాస్‌గౌడ్, బ్రిజేశ్ ప్యానల్ భారీ విజయాన్ని కైవసం చేసుకుంది. అసోసియేషన్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ సౌందర్య జోసఫ్, మహిళా కార్యదర్శిగా ఎం భవాని, అకాడమిక్ కార్యదర్శిగా గోపాల సుదర్శన్, ఆర్థిక కార్యదర్శిగా గంగాధర్, ఉపాధ్యక్షులుగా ఆడెపు రమేశ్, జీఎన్ జగన్, కార్యదర్శులుగా ఎస్ హరీశ్‌కుమార్, ఎం రామాచారి, యూనివర్సిటీ కార్యదర్శులుగా రాకేశ్‌భవాని, డీ సమ్మయ్య, యాదయ్య, పీ రాములు, రాజేశ్ ఎన్నికయ్యారు. పూర్వ అధ్యక్షులు సంగి రమేశ్, విజయ్‌కుమార్ గెలుపొందిన వారిని అభినందించారు.

శ్రీనివాస్‌గౌడ్

బ్రిజేశ్

పట్నం నరేందర్‌రెడ్డికి బెయిల్

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): లగచర్ల కేసు (ఎఫ్ఐఆర్ 145)లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు జస్టిస్ కే లక్ష్మణ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రూ.25 వేల పూచీకత్తుతోపాటు అంతే మొత్తంతో రెండు ష్యూరిటీలు సమర్పించాలని, పోలీసుల విచారణకు సహకరించాలని, సాక్షులను ప్రభావితం చేయరాదని, ప్రతి సోమవారం పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని పిటిషనర్‌కు స్పష్టం చేశారు.

మావోయిస్టు నేత బల్మూరి అరెస్ట్

- 40 ఏళ్ల ఉద్యమ ప్రస్థానానికి తెర
- ప్రభాకర్‌పై 25 లక్షల రివార్డు
- కాంకేర్ పోలీసుల వెల్లడి

కొత్తగూడెం క్రైం/సారంగాపూర్, డిసెంబర్ 23 : మావోయిస్టు సీనియర్ నేత, డీకేఎస్‌జెడ్ సీఎం ఇన్‌చార్జి బల్మూరి నారాయణ్‌రావు అలియాస్ ప్రభాకర్‌రావును ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ సోమవారం వెల్లడించారు. అంతగఢ్ ఏజెన్సీలో మావోయిస్టు నేతలు ఉన్నారన్న సమాచారంతో భద్రతాబలగాలు సెర్చింగ్ ఆపరేషన్స్ ప్రారంభించాయి. ఆదివారం నిర్వహించిన ఆపరేషన్‌లో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ మొబైల్ పొలిటికల్ స్కూల్ ఇన్‌చార్జి బల్మూరి నారాయణరావును అరెస్ట్ చేసినట్టు ఐజీ వెల్లడించారు. జగిత్యాల జిల్లా బీర్పూర్‌కు చెందిన నారాయణరావు ఇంటర్ వరకు ధర్మపురిలో చదువుకున్నారు. 1984లో మావోయిస్టు పార్టీలో సభ్యుడిగా చేరారు. డీకేఎస్‌జెడ్‌సీలో లాజిస్టిక్స్ సప్లై చేస్తూ ఎంవోపీవోఎస్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు అగ్రనాయకులకు సన్నిహితుడు, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గణపతికి బంధువు. ప్రభాకర్‌రావుపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది

మైత్రీ మూవీస్ పరిహారం 50లక్షలు

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన రేవతి కుటుంబానికి పుష్ప-2 నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్ అధినేతలు మైత్రీ అధినేతలు రవిశంకర్, నవీన్ యెర్నేని 50 లక్షల ఆర్థిక సాయం చేశారు. సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న రేవతి కుమారుడు శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రేవతి భర్తను పరామర్శించి 50 లక్షల చెక్కును అందజేశారు. 'రేవతి మరణం చాలా బాధకరం. ప్రస్తుతం శ్రీతేజ్ కోలుకుంటున్నాడు. బాధిత కుటుంబానికి మా వంతు సాయం అందించడానికే వచ్చాం. మా అండ ఎప్పటికీ ఉంటుంది.' అని వారు పేర్కొన్నారు.



మంత్రి కోమటిరెడ్డి సమక్షంలో రేవతి భర్తకు రూ.50లక్షల చెక్కు అందజేస్తున్న మైత్రీ మూవీ మేకర్స్ అధినేత నవీన్ యెర్నేని

విరాళాలు కోరిన తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): శ్రీతేజ్‌కు అండగా ఉంటామని తెలంగాణ ఫిల్మ్ చాంబర్ తెలిపింది. బాలుడి వైద్యం కోసం తమ సభ్యుల నుంచి విరాళాలు స్వీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ప్రెసిడెంట్ సునీల్ నారంగ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

సినీపెద్దలు ముందే స్పందిస్తే బాగుండేది: ఆర్యవైశ్య మహాసభ

ఖైరతాబాద్, డిసెంబర్ 23: సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట ఘటనపై సినీపరిశ్రమ పెద్దలు తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి సాయం చేస్తే బాగుండేదని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అభిప్రాయం వ్యక్తంచేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హీరో ఒక్క రోజు జైలులో ఉండి వస్తే స్పందించిన సినీ పెద్దలు బాధిత కుటుంబాన్ని కూడా పరామర్శించాల్సిందని చెప్పారు. రేవతి కుటుంబానికి ఆర్యవైశ్య మహాసభ తరఫున అండగా నిలుస్తామని తెలిపారు. సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు రవికుమార్, వెంకటేశ్, శారద, సామ్రాజ్య లక్ష్మి పాల్గొన్నారు.

దాడి ఖండించిన మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ప్రజాస్వామ్యంలో భౌతికదాడులకు తావులేదని సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరూ వ్యవహరించకూడదని సూచించారు. అల్లు అర్జున్ ఇంటిపై దాడిని ఎక్స్ వేదికగా ఖండించారు. తొక్కిసలాట కేసు కోర్టులో ఉందని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని పేర్కొన్నారు.

బెనిఫిట్ షోలకు అనుమతులివ్వొద్దు: సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): సినిమాలకు బెనిఫిట్ షోలు, టికెట్ల రేట్ల పెంపునకు ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వొద్దని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సంధ్య థియేటర్ ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను సోమవారం కిమ్స్ దవాఖానలో ఆయన పరామర్శించారు. బాలుడికి వైద్యం అందుతున్న తీరుపై డాక్టర్లతో మాట్లాడారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తెలంగాణలో బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వబోమని ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నానని చెప్పారు. ఏపీలోనూ ఇటువంటి నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫేక్ వీడియోలు పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలి

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పేరిట ఫేక్ వీడియోలు తయారు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు తప్పు చేయకపోయినా కేసులు పెట్టిన పోలీసులు ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని ఓ ప్రకటనలో ప్రశ్నించారు. అల్లు అర్జున్ వ్యవహారంలో బీఆర్ఎస్ పేరుతో ఫేక్ వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సహనాన్ని కోల్పోయా.. సారీ!

- మీడియాకు సీపీ క్షమాపణలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో) హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): జాతీయ మీడియా అమ్ముడుపోయిందని కామెంట్ చేసిన హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మీడియాకు క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఎక్స్‌లో సోమవారం పోస్ట్ పెట్టారు. సంధ్యా థియేటర్ వ్యవహారంపై ఆదివారం ప్రజెంటేషన్ ఇచ్చిన తర్వాత జాతీయ మీడియా ప్రతినిధులు పలు ప్రశ్నలు అడిగారు. రెచ్చగొట్టేలా ప్రశ్నలు వేయడంతో కాస్త సహనాన్ని కోల్పోయానని విచారం వ్యక్తంచేశారు.

పుష్ప-2 యూనిట్‌పై చర్యలు తీసుకోవాలి

- పోలీసులకు ఎమ్మెల్సీ చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న) ఫిర్యాదు

పీర్జాదిగూడ, డిసెంబర్ 23: పుష్ప-2 సినిమాలో పోలీసులను కించపరిచేలా సన్నివేశాలు తీశారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ చింతపండు నవీన్‌కుమార్(తీన్మార్ మల్లన్న) మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సినిమాలో పోలీస్ అధికారి స్విమ్మింగ్‌పూల్‌లో ఉండగా హీరో మూత్రం పోసే సన్నివేశం పోలీసులను అవమానించినట్టుందని ఫిర్యాదులో పేర్కొన్నట్టు పోలీసులు తెలిపారు. దర్శకుడు సుకుమార్, హీరో అల్లు అర్జున్, నిర్మాతలపై చర్యలు తీసుకోవాలని కోరినట్టు సీఐ చెప్పారు.

విచారణకు నేడు రావాలి..!

- అల్లు అర్జున్‌కు పోలీసుల నోటీసులు
- మధ్యంతర బెయిల్‌పై ఉన్న అల్లు అర్జున్
- విచారణకు హాజరు కావడంపై సందేహాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట కేసులో హైకోర్టు మధ్యంతర బెయిల్‌పై ఉన్న సినీనటుడు అల్లు అర్జున్‌ను పోలీసులు మరోసారి విచారణకు పిలిచారు. ఈ మేరకు విచారణకు హాజరు కావాలని చిక్కడపల్లి పోలీసులు సోమవారం నోటీస్ ఇచ్చారు. మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని పేర్కొన్నారు. నోటీసులు ఇచ్చి విచారణ పిలవడానికి, మధ్యంతర బెయిల్‌తో సంబంధం లేదని న్యాయనిపుణులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. పోలీసుల నోటీసులకు స్పందించి అల్లు అర్జున్ విచారణకు హాజరవుతాడా? లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది.

అల్లు అర్జున్ మామకు అవమానం!

- దీపాదాస్ మున్షీతో భేటీకి చంద్రశేఖర్‌రెడ్డి ప్రయత్నం
- మాట్లాడకుండానే తిప్పిపంపిన దీపాదాస్ మున్షీ
- చంద్రశేఖర్‌రెడ్డి రాక విషయమే తెలియదన్న పీసీసీ చీఫ్

దీపాదాస్ మున్షీతో చంద్రశేఖర్‌రెడ్డి భేటీ

హైదరాబాద్, డిసెంబర్ 23(నమస్తే తెలంగాణ): సినీనటుడు అల్లు అర్జున్ మామ, కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డికి గాంధీభవన్‌లో అవమానం జరిగినట్టు తెలుస్తున్నది. సంధ్య థియేటర్ ఘటనపై ప్రభుత్వం వర్సెస్ అల్లు అర్జున్ ఎపిసోడ్ నడుస్తున్న పరిస్థితుల్లో చంద్రశేఖర్‌రెడ్డి గాంధీభవన్‌కు వెళ్లడం, ఆయనతో మాట్లాడేందుకు దీపాదాస్ మున్షీ నిరాకరించడం చర్చనీయాంశంగా మారాయి. మున్షీ చాంబర్‌లోకి వెళ్లిన చంద్రశేఖర్‌రెడ్డి ఆమెతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. కానీ ఆమె నిలబడి ఇక వెళ్లిపోదాం అంటూ అక్కడి నుంచి బయటకు వెళ్లారు. చంద్రశేఖర్‌రెడ్డి గాంధీభవన్‌కు వచ్చిన సంగతే తెలియదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను చెప్పారు.

దాడి నిందితులకు బెయిల్

- అల్లు అర్జున్ ఇంటిపై దాడి కేసు నిందితులకు ఊరట

బంజారాహిల్స్, డిసెంబర్ 23: అల్లు అర్జున్ ఇంటి వద్ద దాడి కేసులో అరెస్టయిన ఆరుగురు నిందితులకు బెయిల్ లభించింది. జూబ్లీహిల్స్ పోలీసులు ఆదివారం అరుగురిని అరెస్ట్ చేసి సోమవారం ఉదయం 7 గంటలకు 17వ ఏసీజేఎం న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా వారికి రూ.10వేల సొంత పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేశారు. 12 గంటల్లోనే బెయిల్ లభించడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు సరైన ఆధారాలు జతపర్చకపోవడం వల్లే బెయిల్ లభించిందని న్యాయనిపుణులు చెబుతున్నారు.

సినీపరిశ్రమ ఏపీకి పోతుందా?

- ఏపీకి రమ్మంటున్న టీడీపీ నేతలు
- పవన్ కల్యాణ్ సూచనగా ప్రచారం
- పవన్ మాటల్లో తప్పేముంది?
- పరిశ్రమ ఎక్కడికీ పోదు: శ్రీధర్ బాబు

హైదరాబాద్ డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): తెలుగు సినీపరిశ్రమ ఏపీకి తరలిపోతుందా అనే చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తున్నది. టీడీపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. చిత్రపరిశ్రమ ఏపీకి వస్తే బాగుంటుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారని, టాలీవుడ్ ఏపీకి వస్తే స్వాగతమని వ్యాఖ్యానించారు. ఏపీలో సినిమాల చిత్రీకరణకు చాలా మంచి ప్రదేశాలు ఉన్నాయని అన్నారు. అటు.. టీడీపీ ఏపీ నేతల వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. సినీ పరిశ్రమను ఏపీకి రమ్మని పవన్ కల్యాణ్ కోరడంలో తప్పేముందని వ్యాఖ్యానించారు. పరిశ్రమ ఎక్కడికీ పోదని, హైదరాబాద్‌లోనే ఉంటుందని తెలిపారు.

మంచు ఇంట్లో మళ్లీ మంటలు

- విష్ణుతో ప్రాణహాని ఉందని పోలీసులకు మనోజ్ ఫిర్యాదు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): సినీనటుడు మంచు మోహన్‌బాబు ఇంట్లో మళ్లీ ఘర్షణలు రాజుకున్నాయి. తన సోదరుడు విష్ణు, అతని అనుచరుల నుంచి ప్రాణహాని ఉందని పహాడీషరీఫ్ పోలీసులకు మనోజ్ ఫిర్యాదు చేశాడు. ప్రణాళిక ప్రకారం తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నారని తెలిపాడు. డిసెంబర్ 8న ఉదయం 9.30గంటలకు తనపై దాడి జరిగిందని, డయల్ 100కు కాల్ చేశానని, కేసు కూడా నమోదైందని వివరించాడు. అప్పుడు కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేయలేదని, కిరణ్, విజయ్‌రెడ్డితో పాటు పలువురిపై ఫిర్యాదు చేశానన్నారు. ఆ తర్వాత విష్ణు అనుచరులతో దాడి చేయించాడని పేర్కొన్నాడు. తనను ఇంట్లో నుంచి పంపించేందుకు కుట్ర చేస్తున్నాడని ఆరోపించాడు. తాము బయటకు వెళ్తే తనకు, తన భార్య, పిల్లలకు ప్రాణహాని ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు రక్షణ కల్పించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

మోహన్‌బాబుపై చట్టప్రకారం చర్యలు

- రాచకొండలో నూతన ఠాణాల ఏర్పాటుకు సన్నాహాలు
- వచ్చే ఏడాది అందుబాటులోకి కమాండ్, కంట్రోల్ సెంటర్
- నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి
- డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలే: రాచకొండ సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): మీడియా ప్రతినిధిపై దాడి కేసులో సినీ నటుడు మోహన్‌బాబుపై చట్టప్రకారం నడుచుకుంటామని, ఆయనకు మరోసారి నోటీసులు జారీ చేస్తామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు. వీఐపీలు, సెలబ్రెటీల బౌన్సర్లు హద్దుమీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వచ్చే ఏడాది కొత్త డివిజన్లు, పోలీస్ స్టేషన్లతోపాటు రాచకొండ కమిషనరేట్ కమాండ్, కంట్రోల్ సెంటర్ అందుబాటులోకి వచ్చే అవకాశమున్నదని తెలిపారు. కొత్తగా విధుల్లోకి వచ్చే ఏఆర్ కానిస్టేబుళ్లకు సివిల్ పోలీసులతో సమానంగా విధులు కేటాయిస్తామని, అన్ని రకాలైన పనులు చేసేవిధంగా వారిని తీర్చిదిద్దుతామని చెప్పారు. నూతన సంవత్సర వేడుకలను నిబంధనలకు లోబడి ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. ఎవరైనా పరిధి దాటి వ్యవహరించినా, డ్రగ్స్‌ను వినియోగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని అన్ని రిసార్టులు, బార్లు, రెస్టారెంట్లు, పబ్బులపై నిఘా పెట్టినట్టు తెలిపారు.

మోహన్‌బాబుకు ఎదురుదెబ్బ

- బెయిల్ పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు



హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): సినీ నటుడు మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురైంది. విలేకరిపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టేసింది. ఈ మేరకు జస్టిస్ కే లక్ష్మణ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మనుమడిని కలిసేందుకు ఇటీవల దుబాయ్ వెళ్లిన మోహన్‌బాబు.. అక్కడి నుంచి తిరిగొచ్చి ప్రస్తుతం తిరుపతిలో ఉన్నారని ఆయన తరఫు న్యాయవాది తెలిపారు. గుండె, నరాల సమస్యలతో బాధపడుతున్న మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. దీనిపై పోలీసుల తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నెల 10న జల్‌పల్లిలోని నివాసం వద్ద విలేకరిపై దాడికి పాల్పడిన మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదైందని, ఆయనపై తీవ్రమైన అభియోగాలు ఉన్నందున ముందస్తు బెయిల్ ఇవ్వవద్దని కోరారు. ఇరుపక్షాల వాదనల అనంతరం మోహన్‌బాబు పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్టు న్యాయమూర్తి ప్రకటించారు.